క్లుప్తంగా

నేడు శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం



గిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవాన్ని గురువారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై కూర్చోబెట్టి గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేర్చనున్నారు.

కమనీయం చెన్నకేశవుల కల్యాణం

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడు చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఉగాది పండగను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో ఉదయం అమ్మవారికి, స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు సమర్పించిన పట్టు వస్త్రాలతో శ్రీదేవి, భూదేవి, చెన్నకేవ స్వామి విగ్రహాలను పురోహితులు అలంకరించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవారి ఆశీర్వాదాలను పొందారు. కళ్యాణ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం, తీర్థాలను అందించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

వలంటరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోడుమూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లద్దగిరి-2 గ్రామసచివాలయం పరిధిలో జనరల్, బీసీ-డి జనరల్ పోస్టులు ఖాళీగా ఉండగా, లద్దగిరి-1 గ్రామ సచివాలయం జనరల్, వర్కూరు-గ్రామ సచివాలయం-1 బీసీ-ఏ మహిళ, కోడుమూరు-5 గ్రామ సచివాలయం ఎస్టీ జనరల్, ముడుమలగుర్తి గ్రామ సచివాలయం (క్రిష్టాపురం) బీసీ-బీ జనరల్ వలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు బుధవారం గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన వృషభాల రైతులకు నగదు బహుమతులను దాతల చేతుల మీదుగా అందించనున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పాణ్యం: మండల కేంద్రంలోని నెరవాడ మెట్ట సుంకులా పరమేశ్వరీ ఆలయం వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సర్పంచ్ లింగాల శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో నెరవాడ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వెంకటక్రిష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు బుధవారం 2,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.152 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 2,265 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

25న మండల మీట్

గూడూరు: ఈనెల 25న మండల పరిషత్ సర్వసభ సమావేశం ఎంపీపీ సునీతమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

చెక్‌డ్యామ్‌లో పడి గుల్బర్గా వాసి మృతి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని హెలిప్యాడ్ సమీపంలో ఉన్న చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా, జిడిగ గ్రామానికి చెందిన గురప్ప(30) మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం అతని మృతదేహం నీటిపై తేలుతున్నట్లు గమనించిన భక్తులు సమీపంలోని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వన్‌టౌన్ పీఎస్ రైటర్ సుంకన్న, పోలీసులు చెక్ డ్యామ్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అతని వద్ద దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించి వారి బంధువులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు చెప్పారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు బహుమతులందించనున్నారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి ప్రారంభించారు.



ఓర్వకల్లులో పంచాంగంలో పాల్గొన్న ప్రజలు



కొత్తూరులో అర్చకులకు సన్మానం చేస్తున్న ఈఓ



మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు



సి.బెళగల్‌లో పంచాంగం వింటున్న గ్రామస్తులు

ఊరూరా ఉగాది సంబరం

- పంచాంగం వినిపించిన పురోహితులు
- కిక్కిరిసిన ఆలయాలు



సి.బెళగల్‌లో రంగస్వామి దేవతామూర్తుల పల్లకి సేవ



నెరవాడ గ్రామంలో పుట్టాలమ్మకు బోనాలతో తీసుకెళ్తున్న మహిళలు

ఓర్వకల్లు: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ తెలుగు సంవత్సరంలో మొట్టమొదటి పండుగ కావడంతో ప్రజలు ఊరూరా సంబరాలు జరుపుకున్నారు. దయాన్నే స్నానాలాచరించి నూతన వస్త్రాలు ధరించి గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన ఆలయాల వద్ద పురోహితులు ప్రజలకు పంచాంగాన్ని వినిపంచారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని, నల్ల ధాన్యాలకు బలముందని పురోహితులు వివరించారు. పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు, క్రికెట్, కబడ్డీ వంటి పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద ఉగాది పచ్చళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ మద్దిలేటి, ఆయా గ్రామాల సర్పంచులు, ఆలయ కమిటీ చైర్మన్లు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

- **సి.బెళగల్:** ఉగాది ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. సాయంత్రం సి.బెళగల్‌లోని రంగస్వామి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. అనంతరం ఆలయ పూజారులు వెంకటేశ్వర్లు, పురోహితులు నరసింహారావు గ్రామస్తులకు పంచాంగం వినిపించారు. చింతలముని రంగడు, నల్లారెడ్డి స్వాముల ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సీబీ రామ్మోహన్‌రెడ్డి, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముడుమాల గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వర్ల ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఊరేగించారు. మొదట గ్రామస్తులు ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో ఫలహారాలను గ్రామ చివర పొలాల్లో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
- **గూడూరు:** పట్టణంలో ఉగాది వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఆలయాలు సాయంత్రం భక్తులతో కిటకిటలాడాయి. సుంకులమ్మ ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. అమ్మ వారికి నైవేద్యం పెట్టి కానుకలు సమర్పించుకున్నారు.
- **పాణ్యం:** మండలంలో తెలుగు సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కొత్త ధాన్యాలతో పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం మండల కేంద్రంలో గ్రామోత్సవం నిర్వహించారు. నెరవాడ పుట్టాలమ్మకు మహిళలు బోనాలు సమర్పిమచి మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో పండితులు సుబ్బశాస్త్రి పంచాంగం వినిపించారు. కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పుల్లయ్య, వీరయ్యలను దేవదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలతో సన్మానించారు.
- **గడివేముల:** ఉగాది సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజించారు. గడివేముల చెన్నకేశవస్వామి ఆలయం వద్ద పండితులు ఆదినారాయణశర్మ, గడిగరేవుల శివాలయం వద్ద భోగేశ్వరాలయం ప్రధానార్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ ప్రజలకు పంచాంగాన్ని వినిపించారు. బిలకలగూడూరులోని బాలాజీ ఆలయం, దుర్గాభోగేశ్వరాలయాలకు భక్తులు పోటెత్తారు. గడిగరేవులలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.
- **కల్లూరు:** కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం భీమేశ్వరస్వామి ఆలయం వద్దనుంచి భక్తులు ఎద్దుల బండ్లతో ఊరేగింపుగా చౌడేశ్వరీ మాత ఆలయానికి చేరుకున్నారు. అక్కడ బురదలో ఎద్దుల బండ్లతో ప్రదక్షణ చేశారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మ, తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, కూతురు మాధవిలతరెడ్డి ఆలయానికి చేరుకుని చౌడేశ్వరీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కొండజూటూరులో రంగులు చల్లుకుంటున్న యువకులు





కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గడిగరేవులలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

వైభవంగా వల్లెలాంబదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) వల్లెలాంబ దేవి

కోడుమూరు రూరల్: పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి రథోత్సవం బుధవారం సాయంత్రం అశేషజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా సాగింది. రతోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వల్లెలాంబా..కరుణించవమ్మా అంటూ రథాన్ని ముందుకు లాగారు. ముందుగా భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి స్వగృహం నుంచి అమ్మవారికి మొదటి నైవేద్యాన్ని మేళతాళాలతో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు పట్టణంలోని చిన్న బోయవీధి కాలనీవాసులు బోనంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

రథోత్సవం సందర్భంగా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్‌ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటక చరిత్రలో మరపురాని ఘట్టం



పంచాంగ శ్రవణానికి హాజరైన ప్రజలు



జాతీయ ఉత్తమ నాటకంగా ఎంపికైన కమలపాలిక నాటక కళాకారులను సన్మానిస్తున్న బి.వి.రెడ్డి, పుల్లయ్య

కర్నూలు కల్చరల్: జిల్లా నాటక చరిత్రలో ఒక పద్య నాటకం ఏడు బహుమతులు అందుకోవడం మరుపురాని ఘట్టమని పారిశ్రామిక వేత్త బ్రమ్మర్షి బి.వి.రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో జరిగిన జాతీయ స్థాయి పద్యనాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటకం ప్రథమ బహుమతితో పాటు ఆరు వ్యక్తిగత బహుమతులు కైవసం చేసుకుంది. ఉత్తమ నాటకంగా ఎన్నికైన శ్రీకృష్ణ కమలపాలిక నటులకు, ఉత్తమ నటుడు శ్రీకృష్ణ పాత్రధారి జి.శ్రీనివాస రెడ్డి, ఉత్తమ నటి కమలపాలిక పాత్రధారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడు చిట్టిదొర పాత్రధారి సంగా ఆంజనేయులు, ఉత్తమ హాస్య నటి సింగారి పాత్రధారి హసీనా, ఉత్తమ సంగీతం హార్మోనిస్టు బి.బలరాముడు, ఉత్తమ దర్శకులు పత్తి ఓబులయ్యను ఉగాది సంబరాల వేడుకల్లో ఘనంగా సత్కరించారు. అంతకుముందు కృష్ణ బృందం నాదస్వర కచ్చేరీతో ఉగాది సంబరాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుడు భానుస్వామి పంచాంగ శ్రవణం, కవులు ఇనాయతుల్లా, డాక్టర్ గుండం పాటి విజయసారధి, డాక్టర్ వి.పోతన, కళ్యాణదుర్గం స్వర్ణలత, కెంగార మోహన్‌లచే నిర్వహించిన కవి సమ్మేళనం ఆకర్షణగా నిలిచింది. రాయల మహిళా సమాఖ్య మహిళలు కోలాటం, దేవిశ్రీ శాస్త్రీయ నృత్య ప్రదర్శన, కరీముల్లా బృందం జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం శ్రీకృష్ణ కమలపాలిక నట బృంద రంగస్థల పద్యాలను వినిపించారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహానందిలో డ్రోన్ కెమెరా చక్కర్లు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం రాత్రి ఓ డ్రోన్ కెమెరా చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో చర్చనీయాంశమైంది. దీనిపై స్పెషల్‌బ్రాంచ్, ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీశారు. ఆలయ పరిసరాల్లో అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరణ చేయడం చట్టవిరుద్ధం. అయితే తాజాగా పలు సందర్భాల్లో మహానంది ఆలయంపై డ్రోన్ కెమెరాలు తిరుగుతుండటం వివాదాలకు తావిస్తోంది. గతంలో పలువురు డ్రోన్‌కెమెరాల ద్వారా ఆలయ దృశ్యాలను చిత్రీకరించే సమయంలో పోలీసులు, దేవస్థానం సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దేవస్థానం అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

30న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 30న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. 30న రాత్రి 9 గంటలకు భక్తి భజన పోటీలు ఉంటాయని, పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు ఆదే రోజు సాయంత్రం 6 గంటల్లోపు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97014 47250, 96664 55417 నంబర్లను సంప్రదించాలని కోరారు.

1 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీరామ నవమి జాతర పురస్కరించుకొని వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, గ్రామ నాయకులు సిబి.జానకిరామిరెడ్డి, డి.సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీలోపు జట్టు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 91821 48165, 82472 30953, ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పంచలోహ కవచం విరాళం

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన ఆంజనేయస్వామికి కర్నూలుకు చెందిన యోగేశ్వరరావు, ఆస్పరికి చెందిన దాసప్పగారి అంజినయ్య అనే భక్తులు రూ.65 వేలు విలువ చేసే పంచలోహ కవచం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి నిరంజన్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

శరవేగంగా ఈట్ స్ట్రీట్

- బిర్లా గేట్ సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈట్ స్ట్రీట్
- రూ.80 లక్షలతో పనులు చేపట్టిన మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరం మరింత శోభాయమానంగా మారనుంది. ఇప్పటికే విజయవాడ, హైదరాబాద్ వంటి మహానగరాలతో పోటీ పడుతూ పరిశుభ్రత, పచ్చదనంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. అదే ఉత్సాహంతో అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకెళ్తోంది. అందులో భాగంగా నగర వాసులకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు మున్సిపల్ అధికారులు బిర్లాగేట్ సమీపంలో గుత్తి వైపు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు నడుంబిగించారు. ప్రభుత్వం స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ ఫండ్స్ మంజూరు చేయడంతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రూ.80 లక్షలతో బిర్లా సర్కిల్ సమీపంలో ఈట్ స్ట్రీట్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

ఆరగింపు.. ఆహ్లాదం..

ఈట్ స్ట్రీట్‌లో 10 దుకాణాలు నిర్మిస్తారు. వీటిల్లో ఆహార పదార్థాలతో పాటు టెండర్ ద్వారా వివిధ కంపెనీలకు చెందిన ఐస్‌క్రీమ్‌లు, స్నాక్స్, తినుబండారాలు ఉంటాయి. 2 ఫౌంటెన్లు, సీటింగ్ సౌకర్యం, పిల్లలు ఆడుకునేందుకు బల్లలు, జారుబండ, ఊయలతో పాటు మొత్తం గ్రీనరీ పెంచుతారు. వీక్షకుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు.



చిన్నారుల కోసం జంపింగ్ నెట్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

వచ్చే నెల 15 నాటికి పనులు పూర్తి

నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరవాసుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు బిర్లాగేట్ సమీపంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నంలో విజయవంతమయ్యాయి. కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– మున్సిపల్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్



పనులు జరుగుతున్న దృశ్యం



ఈట్ స్ట్రీట్ నమూనా..